సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం। 20। అక్టోబర్। 2024



కల్యాణ వైభోగమే..

మూడు నెలలపాటు కొనసాగిన మూఢం ముగిసింది. శుభకార్యాలు మొదలయ్యాయి. పెళ్లి బాజాభజంత్రీల మోత మరువైంది.

8లో▸



నాణ్యమైన బోధన అందించాలి

ఆదిలాబాద్‌టౌన్‌: విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని డీఈవో ప్రణీత అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ గెజిటెడ్ నం–1 పాఠశాలను ఆమె శనివారం సందర్శించారు. ఎస్‌ఏ–1 పరీక్షలకు సంబంధించి విద్యార్థుల సన్నద్ధతను పరిశీలించారు.

గరిష్టం/కనిష్టం
31.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తుపాను ప్రభావం కారణంగా పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ శాతం పెరగనుంది.

న్యూస్‌రీల్‌

సోయా కొనుగోలు పరిమితి పెంపు

- మంత్రిని సన్మానించిన ఎమ్మెల్యే పాయల్‌



మంత్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే శంకర్‌

ఆదిలాబాద్‌: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జైనథ్‌లో సోయా కొనుగోళ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎకరాకు కేవలం 6.25 క్వింటాళ్లు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుండటంతో తమకు నష్టం జరుగుతుందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే వెంటనే మంత్రి తుమ్మలకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. సోయా కొనుగోళ్ల పరిమితిని పెంచాలని అభ్యర్థించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ఎకరాకు ఎనిమిది క్వింటాళ్లకు పెంచుతూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే శంకర్ హైదరాబాద్‌లో మంత్రిని కలిసి శాలువాతో సన్మానించి రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

ఈవీఎంల గోడౌన్ పరిశీలన



రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్‌

కైలాస్‌నగర్‌: జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్‌ను కలెక్టర్ రాజర్షి షా శనివారం పరిశీలించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి స్ట్రాంగ్ రూంను తెరిచి అందులోని ఈవీఎంలను తనిఖీ చేశారు. అవి సక్రమంగా ఉన్నాయా ఏమైనా సమస్యలు తలెత్తాయా అనే దాన్ని పరిశీలించారు. అనంతరం తాళం వేసి సీల్ చేయించారు. ప్రతి నెలా తనిఖీల్లో భాగంగానే పరిశీలించినట్లుగా కలెక్టర్ తెలిపారు. అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని భద్రత సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ శ్యామలాదేవి తదితరులున్నారు.

హిందూ సంఘాల ఆందోళన



నినాదాలు చేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్‌: సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బజ్‌రంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. జిల్లా కేంద్రంలోని గోపాలకృష్ణ మఠం నుంచి కాషాయ జెండాలు చేతబూని కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడి ప్రధాన ద్వారం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు బండారి సంతోష్, శ్రీ రాంశర్మ మాట్లాడారు. ఆలయంపై దాడి చేసిన దుండగుడిని మతిస్థిమితం లేని వ్యక్తిగా పేర్కొంటూ తప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఓ వర్గానికి కొమ్ముకాస్తూ హిందూ ఆలయాలను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. దుండగుడిని శిక్షించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఆదిలాబాద్‌: జిల్లాకు చెందిన కరాటే క్రీడాకారులు ఎస్‌జీఎఫ్ జోనల్‌స్థాయి పోటీల్లో సత్తా చాటారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో బాలికల్లో.. అండర్–14 విభాగంలో కాజల్, హారిక, అండర్–17లో అనుష్క, స్వాతి, బాలురలో.. అండర్–14లో విశ్వజిత్, అండర్–17లో షఫాన్, నయన్, అండర్–19లో అబిజిత్, భావనేశ్ విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కాంబ్లే ముఖేష్ కుమార్ తెలిపారు. వీరిని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, కోశాధికారి ఆకాశ్, మాస్టర్లు సంధ్యపవార్, రమ తదితరులు అభినందించారు.

కార్యదర్శులు.. టీచర్లయ్యారు

కైలాస్‌నగర్/ఆదిలాబాద్‌: వారంతా పంచాయతీ కార్యదర్శులు.. నిన్న మొన్నటి వరకు పల్లె పాలనలో తలమునకలయ్యారు. గ్రామాల్లో పారిశుధ్య, వీధిదీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పల్లెవాసులకు సేవలందించారు. అలాంటి వారంతా ప్రస్తుతం బడి బాట పడుతున్నారు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో సత్తా చాటి ఉపాధ్యాయ కొలువుకు ఎంపికయ్యారు. పల్లె రూపురేఖలను మార్చిన వారు ప్రస్తుతం విద్యార్థుల భవితను తీర్చిదిద్దే గురుతర బాధ్యతల్లోకి చేరారు. కొలువుల బాటలో మరో అడుగు వేసి సక్సెస్ సాధించిన వారిపై సండే స్పెషల్.

సండే స్పెషల్

- పంచాయతీ సెక్రటరీ నుంచి ఉపాధ్యాయ కొలువులోకి
- గురువులుగా నూతన బాధ్యతల్లోకి..



టీచర్లుగా ఎంపికైన పంచాయతీ కార్యదర్శులు

పట్టుబట్టి కొలువు కొట్టిన భోజారెడ్డి



బోథ్ మండలం కుచులాపూర్ గ్రామానికి చెందిన కల్లెం నర్సారెడ్డి–వనిత దంపతుల కుమారుడు బోజారెడ్డికి ఉపాధ్యాయ కొలువు కల. 2017 డీఎస్సీలో అర మార్కుతో జాబ్ చేజార్చుకున్నాడు. అయినా నిరాశ చెందలేదు. వెంటనే వచ్చిన నోటిఫికేషన్‌లో సత్తా చాటి పంచాయతీ కార్యదర్శిగా ఎంపికయ్యాడు. ఐదేళ్లపాటు ఇచ్చోడ మండలం మాదాపూర్ సెక్రటరీగా సేవలందించాడు. 2024 డీఎస్సీ నోటిఫికేషన్ రాగానే మరోసారి పుస్తకాలతో కుస్తీ పట్టాడు. ఎస్టీటీ విభాగంలో వంద ర్యాంకు సాధించి టీచర్ కొలువుకు ఎంపికయ్యాడు. ప్రస్తుతం సిరికొండ మండలం కుంటగూడ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నాడు.

లక్ష్యం వీడని పార్థసారథిరెడ్డి



ఇచ్చోడ మండలం అడెగామ గ్రామానికి చెందిన కాళ్ల పరమేశ్వర్‌రెడ్డి–కమల దంపతుల కుమారుడు పార్థసారథిరెడ్డి. ఈయన ఇచ్చోడ మండలం జామిడి పంచాయతీ కార్యదర్శిగా పనిచేశాడు. అయితే ఆ కొలువులోకి రాక ముందు జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాల, కేంద్రీయ విద్యాలయంలో ఎనిమిదేళ్లపాటు ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా బోధించాడు. పంచాయతీ కార్యదర్శిగాగా పనిచేస్తూనే ఉపాధ్యాయ కొలువు సాధనే లక్ష్యంగా శ్రమించాడు. తాజా డీఎస్సీలో స్కూల్‌అసిస్టెంట్ ఇంగ్లీష్ విభాగంలో అత్యుత్తమ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం ఉట్నూర్ జెడ్పీ హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్నాడు.

మూడో జాబ్‌లోకి.. ప్రశాంత్‌



ఆదిలాబాద్ పట్టణం అశోక్ రోడ్‌కు చెందిన రాములు–లక్ష్మిల కుమారుడైన పాతుగంటి ప్రశాంత్ గాదిగూడ మండలం కొలమ పంచాయతీ కార్యదర్శిగా సేవలందించాడు. తండ్రి టీచర్ కావడంతో ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ముందడుగు వేశాడు. ఉపాధ్యాయ కొలువు కొట్టాలని ప్రయత్నం షురూ చేశాడు. సెక్రటరీగా విధులు నిర్వహిస్తూనే ప్రిపేర్ అయ్యాడు. ఇటీవల గురుకుల ఫలితాల్లో సత్తా చాటి పీఈటీ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అయితే విద్యార్థులకు బోధించే అవకాశం లేకపోవడంతో ఆ ఉద్యోగాన్ని చేపట్టలేదు. రెండు కొలువులు సాధించినా సంతృప్తి చెందకుండా టీచర్ జాబ్ కోసం యత్నించాడు. డీఎస్సీ 2024లో జిల్లా స్థాయిలో సోషల్‌లో ఐదో ర్యాంకు సాధించి ముచ్చటగా మూడో కొలువు సాధించాడు. ప్రస్తుతం ఆదిలాబాద్ రూరల్ మండలం ఎంపీయూపీఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు.

కలల కొలువు సాధించిన చంద్రశేఖర్‌



ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన కురాడి చంద్రశేఖర్ మావల మండలం వాగాపూర్ పంచాయతీ కార్యదర్శిగా సేవలందించాడు. తల్లిదండ్రులు రైతుబజార్‌లో పండ్ల వ్యాపారం చేస్తుంటారు. సర్కారు కొలువే లక్ష్యంగా ప్రయత్నించిన ఈయన 2019లో జేపీఎస్‌గా ఎంపికయ్యాడు. కార్యదర్శిగా ఉంటూనే తాను ఇష్టపడ్డ కొలువు కోసం ప్రయత్నించి సక్సెస్ సాధించాడు. డీఎస్సీ–2024లో జిల్లా స్థాయిలో 51వ ర్యాంకు సాధించి ఎస్జీటీగా ఎంపికయ్యాడు. ప్రస్తుతం సిరికొండ మండలం పొన్న ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నాడు.

ముహూర్తం ఖరారు



జిన్నింగ్ మిల్లులో పత్తి నిల్వలు (ఫైల్)

- ఈ నెల 23 నుంచి పత్తి కొనుగోళ్లు
- సీసీఐ ద్వారా 11 కేంద్రాలు ఏర్పాటు
- సందేహాలు, ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక కంట్రోల్ రూం

కైలాస్‌నగర్‌: జిల్లాలో పత్తి కొనుగోళ్లకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 23 నుంచి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో ప్రారంభించాలని యంత్రాంగం నిర్ణయించింది. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏ, బీ కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు ఉదయం 10 గంటలకు షురూ చేయాలని సంకల్పించారు. జిల్లాలో మొత్తం 11 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 8 నుంచి 12శాతం తేమ కలిగిన పత్తి క్వింటాల్‌కు కనీస మద్దతు ధర రూ.7,521గా నిర్ణయించారు. ఆయా కేంద్రాల్లో ఏర్పాట్లతో పాటు రైతుల సందేహాలు, సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం ఐదు శాఖల అధికారులతో కూడిన మల్టీ డిసిప్లీనరీ కంట్రోల్ రూంను ప్రత్యేకంగా అందుబాటులోకి తెస్తున్నారు. తేమశాతం నిర్ధారించేందుకు ఎంపిక చేసిన ఐకేపీ, మార్కెటింగ్ సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు.

కొనుగోలు కేంద్రాలివే..

జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రెండు, బోథ్, సొనాల, పొచ్చెర, నేరడిగొండ, ఇంద్రవెల్లి, నార్నూర్, ఇచ్చోడ, గుడిహత్నూర్, బేల మండల కేంద్రాల్లో ఒక్కోటి చొప్పున కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటికి సంబంధించి తుకాలు, ఖాళీ చేసేందుకు గాను 14 జిన్నింగ్ మిల్లులను ఎంపిక చేశారు. అయితే ఆదిలాబాద్‌లో ఈ నెల 23 నుంచి కొనుగోళ్లు ప్రారంభం కాగా మిగతా కేంద్రాల్లో వచ్చే నెలలో షురూ చేయనున్నారు. ఈకేంద్రాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమే కొనుగోళ్లు చేపట్టనున్నారు. పత్తి లోడ్‌తో వచ్చే వాహనాలను మధ్యాహ్నం రెండు గంటల వరకు మాత్రమే అనుమతిస్తారు. ఆ తర్వాత వచ్చిన వాహనాలకు సంబంధించి మరుసటి రోజు తూకం వేయనున్నారు.

ఏర్పాట్లు పూర్తి..

పత్తి కొనుగోళ్లకు సంబంధించి యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. వ్యవసాయ, మార్కెటింగ్, సీసీఐ అధికారులు, లారీ అసోసియేషన్ నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మరోవైపు ఇప్పటికే ఆయా కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ కాంటాలను సిద్ధం చేశారు. తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలను కల్పించనున్నారు. తేమ శాతం పరిశీలించేందుకు ఐకేపీ, మార్కెటింగ్ శాఖల సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందించారు. యార్డుల్లోని అన్‌లోడింగ్ పత్తిని జిన్నింగ్‌లకు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఐదు శాఖలతో ప్రత్యేక కంట్రోల్ రూం

పత్తి కొనుగోళ్లు సజావుగా సాగేలా, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా సంబంధిత ఐదుశాఖల అధికారులతో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. వ్యవసాయశాఖ కార్యాలయ విస్తరణ అధికారి ప్రసాద్ (90142 08626), వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ సహాయ పర్యవేక్షకులు జె.స్వామి (78935 86672), సీసీఐ కార్యాలయ జూనియర్ అకౌంటెంట్ కె. ప్రవీణ్(90107 80973), లీగల్ మెట్రాలజీ టెక్నికల్ అసిస్టెంట్ ఎల్.నవీన్ కుమార్ (82477 67144), రవాణా శాఖ కార్యాల య సీనియర్ అసిస్టెంట్ జైవంత్ రాథోడ్ (91774 34577) నంబర్లతో ఈ కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. కొనుగోళ్ల ప్రారంభం నుంచి ముగిసే వరకు ఈ కంట్రోల్‌రూం పనిచేయనుంది. రైతులు ఆయా నంబర్లను సంప్రదించి తమ సమస్యలు, సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశాన్ని కల్పించారు.

నాణ్యమైన పత్తి తీసుకురావాలి

ఈ నెల 23న ఆదిలాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్నాం. తేమశాతం 8 నుంచి 12వరకు ఉన్న పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుంది. రైతులు పంట దిగుబడిని ఇంటి వద్ద నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఆరబెట్టుకొని యార్డుకు, సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలి. తమ వెంట ఆధార్, పట్టాదార్ పాస్ బుక్, మొబైల్ ఫోన్ (ఓటీపీ కోసం) తీసుకుని రావాలి. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. రైతులంతా ఒకేసారి రాకుండా దశలవారీగా కేంద్రాలకు వచ్చి పత్తి కొనుగోళ్లు సాఫీగా సాగేలా సహకరించాలి.

– రాజర్షి షా, కలెక్టర్

జైళ్లు సరిపోతలేవు..!



ఆదిలాబాద్ జైలు

- పెరుగుతున్న నేరాలతో సమస్య
- లక్సెట్టిపేట సబ్ జైలుకు అధికంగా తాకిడి
- కొత్తగా జిల్లా కారాగారాలు నిర్మిస్తేనే ఊరట

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రోజు రోజుకు పెరిగిపోతున్న నేరాల తీవ్రతకు రిమాండ్, విచారణ ఖైదీల తాకిడికి జైళ్ల సామర్థ్యం సరిపోవడం లేదు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఆదిలాబాద్ కేంద్రంగా జిల్లా కారాగారం కొనసాగుతుండగా.. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట, ఆసిఫాబాద్ సబ్ జైళ్లు, నిర్మల్‌లో స్పెషల్ సబ్ జైలు ఉన్నాయి. ఆయా జైళ్ల సామర్థ్యాన్ని బట్టి విచారణ ఎదుర్కొంటున్న వారిని కోర్టు ఆదేశాల మేరకు జైళ్లలో ఉంచాల్సి ఉంటుంది. ఈ మేరకు వారికి తగిన వసతులు, సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. వివిధ కేసుల్లో జైలుకు వస్తే కనీసం మూడు రోజుల నుంచి మూడు నెలల వరకు, రిమాండ్‌పై వచ్చే వాళ్లు ఉంటున్నారు. నేర తీవ్రతను బట్టి ఆయా కేసుల్లో బెయిల్ వచ్చేదాకా జైలులో ఉండాల్సి ఉంటుంది. ఇక రెండేళ్ల వరకు శిక్ష విధించిన వారిని ఆదిలాబాద్ జైలులో ఉంచుతున్నారు. మగ ఖైదీలతో పోలిస్తే మహిళలకు ప్రత్యేక బ్యారక్‌లు కేటాయించాల్సి ఉంది.

నిజాం కాలం నాటివి..

ఆసిఫాబాద్, లక్సెట్టిపేట సబ్‌జైళ్లు నిజాం కాలంలో నిర్మించినవి. ఆసిఫాబాద్ జైలు మొదట జిల్లా జైలుగా ఉండేది. తర్వాత ఆదిలాబాద్‌కు మార్చారు. ప్రస్తుతం మంచిర్యాల జిల్లా పరిధిలో ఉన్న లక్సెట్టిపేట జైలు సామర్థ్యం కంటే అధికంగా కేసులు నమోదవుతున్నాయి. దీంతో విచారణ ఖైదీలను ఆదిలాబాద్‌కు తరలిస్తున్నారు. జిల్లాలు ఏర్పడినప్పటికీ నాలుగు జిల్లాల్లో సబ్ జైళ్లుగానే కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లోనూ కొత్త జైళ్లు నిర్మించాలని ఆ శాఖ అధికారులు కలెక్టర్లకు వినతిపత్రాలు ఇచ్చారు. ఒక్కో జైలు నిర్మాణానికి 25 ఎకరాల భూమితోపాటు రూ.95 కోట్లు అవసరం. జిల్లా కేంద్రం సమీపం, చుట్టుపక్కల నిర్మిస్తే ఖైదీల కుటుంబాల రాకపోకలకు వీలుగా ఉంటుంది. కొత్త జిల్లా కేంద్రాల్లో సర్కారు భూముల లభ్యత లేకపోవడంతో కొత్త కారాగారాల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. ఇటీవల మంచిర్యాల జిల్లా కేంద్రంలోని భూదాన్ భూముల్లో 12 ఎకరాల్లో జిల్లా జైలు కోసం భూమి ఇచ్చేందుకు సర్వే చేశారు. జైళ్ల శాఖ నుంచి అనుమతి వస్తే కొత్త జైలు నిర్మాణానికి ఆస్కారం ఏర్పడనుంది. నిర్మల్ పరిధిలోనూ కొత్త జైలు నిర్మించాల్సిన అవసరం ఉంది.

మంచిర్యాలలోనే నేరాలు అధికం..

ఉమ్మడి జిల్లా పరిధిలో మంచిర్యాల జిల్లా ముఖ్యంగా కోల్‌బెల్ట్ ప్రాంతాల నుంచి అధికంగా నేరాలు నమోదవుతున్నాయి. దొంగతనాల నుంచి గంజాయి, హత్యాయత్నాలు, పోక్సో వంటి తీవ్ర నేరాలు చేస్తూ అనేక మంది జైలు పాలవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మిగతా ప్రాంతాల కంటే ఇక్కడే అధికంగా నేరాలు నమోదవుతున్నాయి. మంచిర్యాల పరిధిలో ఉన్న లక్సెట్టిపేట సబ్ జైలు సామర్థ్యం 25కాగా, ప్రస్తుతం 43మంది ఉంటున్నారు. అధికంగా ఉన్నవారిని ఎప్పటికప్పుడు ఆదిలాబాద్‌కు తరలించాల్సి వస్తోంది. ఆదిలాబాద్ జిల్లా జైలులో మొత్తం సామర్థ్యం 330మంది వరకు ఉండగా ప్రస్తుతం 200మంది వరకు ఉన్నారు. నెలకు ఇక్కడికి సగటున 150మంది వరకు వస్తున్నారు. ఇక్కడ రిమాండ్ ఖైదీలతోపాటు రెండేళ్ల వరకు జైలు శిక్ష పడిన ఖైదీలు ఉంటారు. ఇక నిర్మల్ సబ్ జైలుకు నెలకు సగటున 150నుంచి 200మంది వరకు వస్తున్నారు. ఈ జైలు సామర్థ్యం 38మంది వరకు ఉండొచ్చు. ప్రస్తుతం 37మంది ఉన్నారు. అంతకన్నా ఎక్కువగా వస్తే ఆదిలాబాద్‌కు తరలిస్తున్నారు. ఇక్కడ నిర్మల్‌లోనూ కొత్త జిల్లా జైలు నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు జైలు అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఆసిఫాబాద్ సబ్ జైలు విస్తీర్ణంలో పెద్దగా ఉండడంతో ఆ జైలునే జిల్లా జైలుగా ఉపయోగించుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ జైలు సామర్థ్యం 66మంది కాగా, ప్రస్తుతం 49మంది ఉన్నారు. నెలకు వంద మంది వరకు ఇక్కడికి వస్తున్నారు. మంచిర్యాల పరిధిలో జిల్లా జైలు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించామని ఉన్నతాధికారుల ఆమోదం రాగానే కొత్త జైలు నిర్మించే అవకాశముందని జైలర్ స్వామి 'సాక్షి'తో తెలిపారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...



జిల్లా కేంద్రంలో బతుకమ్మ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని భాగ్యనగర్, ఆదిత్యనగర్ కాలనీల్లో తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను కూడళ్లలో ఉంచి ఆడపడుచులు బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... ఒక్కేసి పువ్వేసి చందమామ అంటూ ఆడి పాడారు. అనంతరం వెళ్లిరా బతుకమ్మ అంటూ జలాశయాల్లో వాటిని నిమజ్జనం చేశారు. - ఆదిలాబాద్



'భాగ్యనగర్'లో బతుకమ్మ ఆడుతున్న ఆడపడుచులు



క్యాన్సర్ బాధితులకు నాణ్యమైన వైద్యసేవలు

ఆదిలాబాద్‌టౌన్‌: జిల్లాలోని క్యాన్సర్ బాధితులు పాలియేటివ్ కేర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. హాస్పైస్ అండ్ పాలియేటివ్ కేర్ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని రిమ్స్ ఆసుపత్రిలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో 620 మంది క్యాన్సర్ బాధితులు పాలియేటివ్ కేర్‌లో పేర్లు నమోదు చేసుకున్నారని, వారికి నాణ్యమైన వైద్య సేవలందించేలా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కృష్ణ, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఆదిలాబాద్‌టౌన్‌: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకుని తగిన విధంగా రక్షణ పొందాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో డీఎస్‌ఎల్‌ఏ ఆధ్వర్యంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాలికల సంరక్షణకు రూపొందించిన చట్టాలు, అఘాయిత్యాలకు పాల్పడిన సందర్భంలో నేరస్తులకు పడే శిక్షలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్, న్యాయరక్షక్ గంగారాం, అశోక్, ఉమేష్‌రావు, ప్యానల్ అడ్వకేట్ ఎం.అశోక్, ప్రిన్సిపాల్ గణేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాసర ఆలయంలో పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయంలో ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ శనివారం పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, వైదిక బృందం ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

ఉచితశిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువకులకు కేంద్ర ప్రభుత్వ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డీడీయూజీకేవై) పథకంలో భాగంగా నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు న్యాక్ ఇన్‌చార్జి రమేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ల్యాండ్ సర్వే, ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్ కోర్సుల్లో మూడునెలల పాటు ఉచిత భోజన, వసతితోకూడిన శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. యూనిఫాం, స్టేషనరీ, శిక్షణ సామగ్రిని అందిస్తారని తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికేట్‌తోపాటు వివిధ కంపెనీల్లో ఉపాధి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న 18 నుంచి 35 ఏళ్లలోపు యువకులు విద్యార్హత సర్టిఫికెట్, కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు, రేషన్, ఆధార్ కార్డు, నాలుగు పాస్‌ఫొటోలతో ఆదిలాబాద్‌లోని న్యాక్ కార్యాలయంలో ఈనెల 24 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ 9154548063 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

టీచర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వ్యక్తిపై శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ సతీశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆసిఫాబాద్‌లో మాజిత్‌వాడ పాఠశాలలో పని చేస్తున్న టీచర్ గోవిందరావుపై విద్యార్థిని తండ్రి విలాస్ దుర్భాషలాడి దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక

మంచిర్యాలఅర్బన్: స్థానిక మిమ్స్ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక నిర్వహించారు. 32(టి) బెటాలియన్ ఆదిలాబాద్, ఎన్‌సీసీ బెటాలియన్‌కు చెందిన సుబేదార్ కవల్జిత్ సింగ్, హవల్దార్ రవీందర్ పర్యవేక్షణలో విద్యార్థులకు దేహదారుఢ్య, మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఇందులో 56 ఎన్‌సీసీ కేడెట్లను ఎంపిక చేశారు. ప్రిన్సిపాల్ ఉపేందర్‌రెడ్డి, కరస్పాండెంట్ శ్రీనివాసరాజు, డైరెక్టర్లు శ్రీధర్‌రావు, విజయ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాజీపూర్‌లో భారీ వర్షం


మంటల్లో తాటిచెట్టు

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): హాజీపూర్ మండలంలో శనివారం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. వరి, పత్తి పంటలు తీవ్రంగా నష్టానికి గురయ్యాయి. పెద్దంపేటలో బొప్పు ఎల్లయ్య ఇంటి ఆవరణలోని తాటి చెట్టుపై పిడుగుపడింది.



కల్యాణ వైభోగమే..

- ఇక శుభముహూర్తాలు షురూ..
- ముగిసిన మూఢం
- ఖరారు అవుతున్న వివాహ తేదీలు
- ఫంక్షన్ హాళ్లు, బట్టల షాపులు బిజీబిజీ

నిర్మల్‌ఖిల్లా: మూడు నెలలపాటు కొనసాగిన మూఢం ముగిసి శుభకార్యాలకు లగ్నాలు మొదలయ్యాయి. పెళ్లి బాజాభజంత్రీల మోత మోగింది. మరో మూడు నెలలు మంచి ముహూర్తాలు ఉన్నాయని పురోహితులు, పంచాంగకర్తలు, పూజార్లు, వేద పండితులు చెబుతున్నారు. వివాహ సంబంధాలు కుదుర్చుకునే క్రతువులు.. పెళ్లిచూపులు, సంబంధం ఒప్పందం, మాటాముచ్చట్లకు ఇదే మంచి సమయమని పేర్కొంటున్నారు. దసరాతో మొదలైన ముహూర్తాలు డిసెంబర్ 26 వరకు ఉన్నాయి. మూడు నెలలు కలిపి సుమారు 32 రోజులకుపైగా శుభముహూర్తాలు ఉండటంతో భాజాభజంత్రీలు, మండపాళ్లు, కేటరింగ్‌వారికి ఆర్డర్లు మొదలయ్యాయి. దీపావళి వేడుకలతోపాటు శుభకార్యాలకు అనువైన నెల కావడంతో జిల్లాకేంద్రంలోని మార్కెట్‌లో సందడి మొదలైంది. వస్త్ర, బంగారం దుకాణాల్లో అమ్మకాలు జోరందుకున్నాయి. బంగారం ఆభరణాల కోసం ఆర్డర్లు వస్తున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ముహూర్తాలు ఇలా..

అక్టోబర్: 12, 13, 16, 20, 23, 24, 27, 28
నవంబర్: 3, 7, 8, 9, 10, 13, 14, 16, 17, 18, 23, 25
డిసెంబర్: 5, 6, 7, 8, 11, 12, 14, 15, 18, 20, 25, 26

షాపింగ్ మాల్స్ సందడి..

పెళ్లంటే ప్రత్యేకంగా కనిపించాలని వధూవరులతోపాటు కుటుంబీకులు, అతిథులు పరితపిస్తుంటారు. జిల్లా కేంద్రంలోని షాపింగ్ మాల్స్, దుకాణాల్లో తమకు నచ్చిన బట్టలు కొనుగోళ్లు చేస్తున్నారు. దీంతో షాపులు సందడిగా మారాయి. ఉదయం నుంచి రాత్రి 11 వరకు షాపులు తెరిచి ఉంచుతున్నారు.

ముస్తాబవుతున్న ఫంక్షన్ హాళ్లు

పెళ్లిళ్ల సీజన్ మొదలుతో ఫంక్షన్ హాళ్లు ముస్తాబవుతున్నాయి. జిల్లాలో దాదాపు వందకు పైగా ఉన్నాయి. వీటి అద్దె రూ.లక్ష నుంచి రూ.8 లక్షల వరకు ఉన్నాయి. సీజన్ కావడంతో వీటి ధరలు అమాంతం పెరిగాయి. జిల్లా కేంద్రంలోని ఫంక్షన్ హాల్ కోసం నెల రోజుల వరకు బుకింగ్ జరిగిందని యజమాని పేర్కొన్నాడు.



మంచిరోజులు వచ్చాయి

మూడు నెలల తర్వాత శుభ ముహూర్తాలకు మంచిరోజులు వచ్చాయి. అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌లో ముహూర్తాలు ఉన్నాయి. చాలామంది ఈనెలలో పెళ్లిళ్ల తేదీలు ఖరారు చేసుకున్నారు. ఇందుకు సమయాత్తమవుతున్నారు.



– సముద్రాల శ్రీకాంతాచార్యులు, పురోహితుడు, నిర్మల్

నలుగురు బైక్ దొంగల అరెస్టు

- రిమాండ్‌కు తరలింపు, బైక్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

శ్రీరాంపూర్: చెడువ్యసనాలకు అలవాటు పడి డబ్బుల కోసం బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురిని శ్రీరాంపూర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీస్‌స్టేషన్‌లో జైపూర్ ఏసీపీ ఏ వెంకటేశ్వర్లు ఈమేరకు వివరాలను వెల్లడించారు. రామగుండం సీపీ, మంచిర్యాల డీసీపీల ఆదేశాల మేరకు శనివారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద సీఐ వేణుచందర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఈక్రమంలో నలుగురు బైక్‌లపై వచ్చారు. వీరిలో అజ్మీరా అక్షయ్‌కుమార్(గోదావరిఖని), దొంతుల ప్రశాంత్(ఎన్టీపీసీ), దేవసహాయం సెల్వా(గోదావరిఖని), చిట్యాల పృథ్వీ(గోదావరిఖని)ని ఆపి వాహనపత్రాలు అడుగగా లేకపోవడంతో లోతుగా విచారించారు. దీంతో అసలు విషయం బయటపడింది. ఏ పని చేయకుండా చెడువ్యసనాలకు బానిసై శ్రీరాంపూర్, జైపూర్, రామగుండం ఏరియాలో రాత్రిసమయంలో రోడ్లపై బైక్‌లను నలుగురు చోరీ చేస్తున్నారు. చోరీ చేసిన బైక్‌లను మంచిర్యాలలో విక్రయించడానికి వస్తుండగా తనిఖీలో పట్టుబడ్డారు. దీంతో వారిని రిమాండ్‌కు తరలించి, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ తెలిపారు. దొంగలను పట్టుకున్న సీఐ, శ్రీరాంపూర్ ఎస్సై సంతోశ్, కానిస్టేబుళ్లు శ్రీను, సత్యంలను ఏసీపీ అభినందించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


రాజేశం మృతదేహం

జన్నారం: మండలంలోని కలమడుగు గోదావరి నది ఒడ్డున ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై తానాజీ నాయక్, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం మున్యాల్ గ్రామానికి చెందిన ఎమునూరి రాజేశం (26) వడ్రంగి పనిచేసేవాడు. గత కొన్నిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. డబ్బులు తీసుకున్న వారికి సక్రమంగా వడ్రంగి పనిచేసేవాడు కాదు. వారు పని చేయాలని ఒత్తిడి చేస్తే తప్పించుకుని తిరిగేవాడు. గ్రామంలో ఈనెల 16న బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లాడు. ఆ తర్వాత ఇంటికి చేరుకోలేదు. శనివారం ఉదయం కలమడుగు గోదావరి నది ఒడ్డున పంట చేల వైపు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అటువైపు వెళ్లిన గొర్రెల కాపర్లు గమనించి గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు మున్యాల్ వాసి అని గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకుని రోదించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. తల్లి రాజవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు

చెరువులో పడి వృద్ధురాలు ..

నర్సాపూర్(జి): భూమి గొడవల కారణంగా మనస్తాపంతో వృద్ధురాలు చెరువులో పడి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై హన్మాండ్లు కథనం ప్రకారం.. మండలంలోని చాక్‌పల్లి గ్రామానికి చెందిన ముస్కు పోసాని (80) కుమారులకు, డొంగుర్గాం గ్రామానికి చెందిన తాండ్ర గంగాసాగర, జంగిపల్లి గజ్జవ్వ, షెల్కెల మంజులతో వ్యవసాయ భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపం చెందిన పోసాని శనివారం మధ్యాహ్నం గ్రామ శివారు ఎర్రగుంట చెరువులో పడి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం వెతకగా, చెరువులో పడి ఉంది. మృతురాలి పెద్ద కుమారుడు ముస్కు భూమన్న ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు. .

బైక్ అదుపుతప్పి సింగరేణి కార్మికుడు మృతి


దుర్గం బాపు (ఫైల్)

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో సింగరేణి కార్మికుడు మృతిచెందాడు. ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం .. మండలంలోని గోలేటికి చెందిన దుర్గం బాపు (57) గోలేటి సీహెచ్‌పీలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం పనినిమిత్తం బైక్‌పై కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వైపు వెళ్తున్నాడు. ఇందిరానగర్ సమీపంలో బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. బాపు తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకుని క్షతగాత్రుడిని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి బంధువు కొర్రాల రాజేందర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

ఆదిలాబాద్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కనుకునాల దేవిదాస్ (25) చికిత్సపొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. ఎస్సై ముజాహిద్ కథనం ప్రకారం.. మండలంలోని లోకారి గ్రామానికి చెందిన దేవిదాస్ ఈనెల 12న ఆదిలాబాద్ నుంచి తన స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. అంకోలి సమీపంలోని దర్గా మూలమలుపు వద్ద అదుపుతప్పి కిందపడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆయన్ను రిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడు అదృశ్యం


ఠాకూర్ కిరణ్‌సింగ్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని అశోక్‌రోడ్‌కు చెందిన ఠాకూర్ కిరణ్‌సింగ్ అదృశ్యమయ్యాడు. సీఐ ప్రమోద్‌రావు కథనం ప్రకారం.. కిరణ్‌సింగ్ (27) పట్టణంలోని ఓ నగల దుకాణంలో పని చేస్తున్నాడు. ఈనెల 17న సాయంత్రం నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలులో చెన్నై వెళ్లి తిరిగిరాలేదు. ఫోన్ స్విచ్ఛాప్ రావడంతో తండ్రి బాలాజీ ఫిర్యాదుతో శనివారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక


విద్యార్థినులను అభినందిస్తున్న ఏఎస్పీ, ఆర్డీవో

భైంసాటౌన్/భైంసారూరల్: మండలంలోని ఇలేగాం గ్రామానికి చెందిన విద్యార్థినులు మనస్వి, మధుప్రియ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబర్చారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఉప్పు రవీందర్ తెలిపారు. ఈ మేరకు శనివారం పట్టణంలో ఏఎస్పీ అవినాష్‌కుమార్, ఆర్డీవో కోమల్‌రెడ్డిని కలువగా, వారు విద్యార్థినులను అభినందించారు. ఈనెల 24న హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పోతన్న, సాయినాథ్, సుధాకర్, కోచ్ గంగాప్రసాద్ ఉన్నారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ


కార్తీక్‌ను అభినందిస్తున్న అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ఆదిలాబాద్: బజార్‌హత్నూరు మండలం జాతర్ల క్రీడా పాఠశాల విద్యార్థి రాథోడ్ కార్తీక్ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు జరిగిన 35వ సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్–14 విభాగంలో విజేతగా నిలిచాడు. ట్రయథ్లాన్ ఈవెంట్‌లో బంగారు పతకం సాధించాడు. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, పి.రాజేష్, పెటా ప్రధాన కార్యదర్శి స్వామి, కోచ్ సునంద్ శనివారం ఈ సందర్భంగా కార్తీక్‌ను అభినందించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో సత్తా

మంచిర్యాలఅర్బన్: జోగులంబ గద్వాల జిల్లాలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 17 వరకు జరిగిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో మంచిర్యాలకు చెందిన వేములపల్లి లక్ష్మణ్‌సాయి సత్తాచాటాడు. స్థానిక కేంద్రీయ విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్న లక్ష్మణ్‌సాయి ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. వచ్చేనెలలో బిహార్‌లో జరిగే జాతీయపోటీల్లో తెలంగాణ జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, డీఈవో యాదయ్య, ఎస్జీఎఫ్ జిల్లా సెక్రటరీ ఫణిరాజాలు లక్ష్మణ్‌సాయిని అభినందించారు.

‘మెడికల్’ చకచకా

- వైద్య కళాశాల నిర్మాణ పనులు వేగవంతం
- వచ్చే మార్చిలోగా పూర్తికానున్న భవనం


గుడిపేటలో వైద్య కళాశాల ప్రధాన భవన నిర్మాణ పనులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా ప్రజలకు ప్రభుత్వ వైద్య కళాశాల త్వరలోనే అందుబాటులోకి రాబోతుంది. హాజీపూర్ మండలం గుడిపేట శివారులో కళాశాల నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. రాత్రి, పగలు రెండు షిఫ్ట్‌ల్లో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. సౌకర్యాలు, అన్ని హంగులతో భవనం సిద్ధమవుతోంది. మంచిర్యాల జిల్లాకు గత ప్రభుత్వం మెడికల్ కాలేజీ మంజూరు చేయగా, నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్‌ఎంసీ) అనుమతి మేరకు పనులు సాగుతుండగా వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి కానుంది.

అన్ని వసతులతో..

మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులు సాగుతుండగా, బోధన తరగతులు, బాలుర, బాలిక వసతి గృహాలు, ప్రిన్సిపాల్ క్వార్టర్స్ భవనాలు ఇలా అన్ని సౌకర్యాలతో పనులు చేపడుతున్నారు. బాలికల వసతి గృహం గ్రౌండ్ ఫ్లోర్‌తో కలిసి మొత్తం 7 అంతస్తులు కాగా, ఇందులో 324 గదుల్లో 582 మంది వరకు విద్యార్థులు ఉండచ్చు. ఇక బాలుర వసతి గృహం గ్రౌండ్‌ఫ్లోర్‌తో కలిసి 6 అంతస్తులు కాగా, ఇందులో 240 గదుల్లో 414 మంది విద్యార్థులు ఉండచ్చు. కళాశాల సముదాయంలో గ్రౌండ్ ఫ్లోర్‌తో కలిపి 2 అంతస్తుల్లో ప్రిన్సిపల్, సూపరింటెండెంట్ క్వార్టర్స్‌తోపాటు గెస్ట్‌హౌజ్ నిర్మాణం చేపడుతున్నారు. కళాశాల ముఖ్య భవనంలో లెక్చరర్ హాళ్లు, 8 వివిధ డిపార్ట్‌మెంట్‌లకు చెందిన గదులు, 7 ల్యాబ్స్ గదులు, క్యాంటీన్ ఇలా పూర్తి సదుపాయాలతో ఉండనున్నాయి. కళాశాల చుట్టూ పకడ్బందీగా ప్రహరీ చేపడుతున్నారు. మెడికల్ కాలేజీ భవనం మార్చిలోగా అన్ని వసతులతో పూర్తి చేస్తామని రోడ్లు, భవనాలశాఖ డీఈఈ రమేశ్ తెలిపారు.


గుడిపేటలో వైద్య కళాశాలలోని బాలుర వసతి గృహ భవనం

మూడేళ్లుగా ఎంబీబీఎస్ తరగతులు

జిల్లా కేంద్రంలో గత మూడేళ్లుగా ఎంబీబీఎస్ తరగతులు నిర్వహిస్తున్నారు. దాదాపు రెండేళ్ల తర్వాత మెడికల్ కాలేజీకి అనుమతులు లభించడంతో గుడిపేటలో నిర్మాణ పనులు సాగుతున్నాయి. ప్రస్తుతం తాత్కాలిక భవనంలో తరగతులు సాగుతుండగా శాశ్వత భవనం పూర్తయితే వచ్చే విద్యా సంవత్సరం తరగతులు ఇక్కడే ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఏటా 100 సీట్ల కేటాయింపులో భాగంగా 40 శాతం బాలురు, 60 శాతం బాలికలకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. కాళోజీ నారాయణరావు ఆరోగ్య యూనివర్సిటీ ఆధ్వర్యంలో ప్రవేశాలు చేపడుతున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో బేకరీ దగ్ధం


కాలిపోయిన సామగ్రి

ఇచ్చోడ: మండలకేంద్రంలోని రంజాన్‌పుర కాలనీలో శనివారం తెల్లవారుజాము షార్ట్ సర్క్యూట్‌తో బేకరీ దగ్ధమైంది. చుట్టుపక్కల వారు గమనించి మంటలార్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష వరకు ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు జాఫర్ తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్ల పట్టివేత



భీమారం: భీమారం సమీపంలోని గొల్లవాగు ప్రాజెక్ట్ వద్ద ప్రభుత్వ స్థలంలో మట్టి తీసి అక్రమంగా తరలిస్తున్న జేసీబీతోపాటు మూడు ట్రాక్టర్లను శనివారం ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టుకున్నారు. జేసీబీతో మట్టి తీస్తుండగా సిబ్బంది పట్టుకుని పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. ఈమేరకు జేసీబీ యజమాని గొల్లపల్లి వీరేశం, ఆపరేటర్ అంగూరి సతీశ్, ట్రాక్టర్ యజమానులు బోగె స్వామి, కాల్వ నరేశ్, అనపర్తి మధుకర్, డ్రైవర్లు అమరగాని గణేశ్, ఆకుదారి మహేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.రాములు తెలిపారు. ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

బాలికల కబడ్డీ జట్టు ఎంపిక


ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన బాలికలు

తాండూర్: మండలంలోని అచ్చులాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్–17 బాలికల కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలల నుంచి 70 మంది బాలికలు హాజరయ్యారు. ఎంపికైనవారు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయిలో జరిగే ఎస్జీఎఫ్ జోనల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

ఎంపికైన వారు..

ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్టుకు బాలికలు ఎంపికయ్యారు. ఎస్.శ్రీజ (ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల(బెల్లంపల్లి), ఎం.శృతి(కేజీబీవీ–బెల్లంపల్లి), కె.నిరీక్ష, బి.అశ్రిత(ట్రినిటీ హైస్కూల్, మంచిర్యాల), ఏ.ఉషారాణి (టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, లక్సెట్టిపేట), ఏ.చంద్రస్మిత(మిమ్స్ మంచిర్యాల), వి.మాధురి(కేజీబీవీ మందమర్రి), ఎం.అమూల్య(జెడ్పీ హైస్కూల్ అచ్చులాపూర్), కె.హర్షిణి(రెవలేషన్ హైస్కూల్), ఎం.మాధవి (టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ లక్సెట్టిపేట), ఎం.కృష్ణకుమారి(జెడ్పీ హైస్కూల్, తంగళ్లపల్లి), జి.సాగరిక(జెడ్పీ హైస్కూల్ కన్నెపల్లి) ఎంపికయ్యారు. స్టాండ్‌బైగా ఎస్‌డీ.అఫ్సన(కేజీబీవీ(యు) మందమర్రి), బి.శ్రీకుందన (సెయింట్ థెరిస్సా రెపల్లేవాడ), సీహెచ్ హర్షిత (జెడ్పీ హైస్కూల్ అచ్చులాపూర్), ఎస్.కీర్తన(టీఎస్ డబ్ల్యూఆర్ఈఎస్ (గర్ల్స్), మందమర్రి)ని ఎంపికయ్యారు. కార్యక్రమంలో సీఐ కుమారస్వామి, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో మల్లేశ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కబడ్డీ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి కె.రాంచందర్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి గాజుల శ్రీనివాస్, పీడీలు కె.రాంమ్మోహనరావు, యాకూబ్, వహీదా, పీఈటీలు రవీంద్ర, రాజేష్, కవిత, శేఖర్, హెచ్‌ఎంలు ఉమ, సాంబమూర్తి పాల్గొన్నారు.

దండారీ ఫొటోగ్రఫీ పోటీల పోస్టర్ ఆవిష్కరణ


ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: జిల్లాలో దండారీ ఉత్సవాన్ని పురస్కరించుకుని బోలి చేతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో దండారీ ఫొటోగ్రఫీ పోటీల పోస్టర్‌ను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లాలోని యువత దండారీ ఫొటోగ్రఫీ పోటీల్లో పాల్గొనాలని కోరారు. ఫౌండేషన్ సభ్యులు ఆత్రం మోతీరాం, సిడాం కిరణ్, సిడాం వరప్రసాద్, టేకం వసంత్‌రావు, ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సైన్స్ సెమినార్


సర్టిఫికెట్లతో సెమినార్‌లో గెలుపొందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక జెడ్పీ బాలుర పాఠశాలలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ అలరించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పొటెన్షియల్స్ అండ్ కన్సర్న్స్ అంశంపై విద్యార్థులు ప్రదర్శించారు. ఇందులో కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్ విద్యార్థి అంటోని(ప్రథమ బహుమతి), జన్నారం స్లేట్ హైస్కూల్‌కు చెందిన అదీ బషేహర్ (ద్వితీయ), మంచిర్యాల జెడ్పీ బాలికల పాఠశాలకు చెందిన భవిష్య తృతీయ బహుమతి సాధించారు. ప్రథమ స్థానంలో నిలిచిన అంటోని త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్లలో పాల్గొంటారని డీఎస్‌వో మధుబాబు తెలిపారు. హెచ్‌ఎంలు పద్మజ, రాజగోపాల్, ఉపాధ్యాయులు సుధా, శ్రీమూర్తి, చక్రపాణి పాల్గొన్నారు.